www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

సోమవారం, 28 జూలై 2025



కొత్తగూడెంలో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, తుమ్మల, పొంగులేటి

ప్రజా సంక్షేమమే.. ప్రభుత్వ ధ్యేయం

- 'ఇందిరమ్మ' పథకం.. చరిత్రాత్మకం
- యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిది..
- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
- ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- అధికారులు సమన్వయంతో పని చేయాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రభుత్వ పథకాలు ప్రజల దరి చేరేలా అధికారులు కృషి చేయాలి
- ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి
- శ్రావణమాసంలో 'ఇందిరమ్మ' గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలి : మంత్రి పొంగులేటి

కొత్తగూడెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం చరిత్రాత్మకమైందన్నారు. యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిదని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో ఆదివారం ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షించారు. సమీక్షలో ప్రధానంగా రెండు జిల్లాలకు చెందిన వర్షాభావం, వరదల ముంపు ప్రధానంగా గోదావరికి వరదలు వస్తే తీసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు, రైతులకు ఎరువుల సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్‌కార్డుల పంపిణీ, వన మహోత్సవ కార్యక్రమం, విద్యారంగ అభివృద్ధి.. తదితర అంశాలపై మంత్రులు సమగ్రంగా చర్చించారు. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రులకు జిల్లాల ప్రస్తుత పరిస్థితులపై వివరించారు.



ఇందిరమ్మ ఇళ్లు చరిత్రాత్మక పథకం : డిప్యూటీ సీఎం భట్టి

ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి నిరుపేదలకు అందజేసే పథకం చరిత్రాత్మకమైందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు సరిపడా యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిదని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. భారీ వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్‌తో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇందిర సౌర జల వికాస పథకం కింద రైతులకు సోలార్ పంపులు, డ్రిప్ స్ప్రింక్లర్లు, ఉద్యాన పంటల సాగుకు ఉచితంగా సౌకర్యాలు కల్పిస్తామని భట్టి తెలిపారు. మూడు సంవత్సరాల్లో రూ.12,600కోట్లు ఖర్చు చేస్తే.. ఈ పథకం ద్వారా గిరిజన రైతుల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతీ జిల్లాలో మహిళా సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. 25 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మించాలని, ఈ పాఠశాలలు ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై వర్షాకాలంలో ప్రత్యేక దృష్టి అవసరమని, వైద్య పరీక్షలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పేదల సంక్షేమంతో పాటు వారిని ఆర్థికంగా అభివృద్ధి పర్చడానికే మహాలక్ష్మి పథకం, రూ.500 గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నట్టు తెలిపారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలో ఇప్పటి వరకు 2కోట్ల ఉచిత ప్రయాణాలను మహిళలు చేశారన్నారు. దేశ చరిత్రలోనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల మంజూరు చేశామన్నారు. ఇందుకుగాను ప్రతీ సోమవారం (మిగతా 6వ పేజీలో)

బోనాల సందడి



తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శ్రావణ మాస బోనాల జాతర ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు అమ్మవారి ఆలయాల్లో ఆదివారం మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా ప్రతి చోటా బోనమెత్తారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో జిల్లా ప్రజలు బోనాల్లో మునిగి తేలారు. ఉమ్మడి జిల్లాలోని పాల్వంచ పెద్దమ్మ తల్లి ఆలయం, ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్ ముత్యాలమ్మ ఆలయం, వరదయ్య నగర్‌లోని మైసమ్మ తల్లి ఆలయం, రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయంతోపాటు పలు ఆలయాల్లో బోనాలు ఘనంగా నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురంహవేలి


ఖమ్మంలో బోనాలతో మహిళలు

తగ్గుతున్న గోదావరి

- 11 గంటల పాటు నిలకడగా ఉన్న నీటిమట్టం



భద్రాచలం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు 35.4 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం ఆదివారం తెల్లవారుజామున 5 గంటల వరకు నిలకడగానే ఉంది. 6 గంటలకు 35.6 అడుగులకు పెరిగింది. మధ్యాహ్నం 11 గంటల వరకు మళ్లీ 35.6 అడుగుల వద్ద నిలకడగా ఉన్న నీటిమట్టం 12 గంటలకు 35.5 అడుగులకు తగ్గింది. 2 గంటలకు 35.2 అడుగులకు తగ్గగా.. సాయంత్రం 5 గంటలకు 34.6 అడుగులకు తగ్గింది. గోదావరి ఒడ్డున స్నానఘట్టాలు నీటమునిగే ఉన్నాయి.


ఎరువుల నిల్వల రికార్డును పరిశీలిస్తున్న కమిషనర్ సురేంద్రమోహన్

గతేడాది అనుభవాలతో.. ముందస్తు చర్యలు

- ప్రతీ కలెక్టర్‌కు రూ.కోటి నిధుల మంజూరు
- ఎగువ ప్రాంతాల వరదలపై ప్రత్యేక కార్యాచరణ
- విపత్తులను ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, డీఆర్‌ఎఫ్ బలగాలు సిద్ధం
- నాన్ అగ్రికల్చర్‌కు యూరియా వాడితే కఠినంగా కేసులు
- రాష్ట్రంలో 860, ఉమ్మడి జిల్లాలో 15 యూనిట్లు గుర్తించాం
- వ్యవసాయశాఖ మంత్రి చొరవతో సమృద్ధిగా ఎరువులు
- 'ఆంధ్రజ్యోతి'తో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్

రఘునాథపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతేడాది ఏర్పడిన విపత్తుల అనుభవంతో ఈ సంవత్సరం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నాం.. వర్షాలు, విపత్తులను ఎదుర్కొనేందుకు కావాల్సిన సామగ్రి, పరికరాల ఏర్పాటుకు ప్రతీ జిల్లా కలెక్టర్‌కు రూ.కోటి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలు, వరద ప్రవాహంపై ఎప్పటికప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నాం..' అని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ కే సురేంద్రమోహన్ తెలిపారు. ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం సహకార సొసైటీని తనిఖీ చేశారు. ఎరువుల గోదాములను పరిశీలించి.. స్టాక్ రికార్డులో ఎరువుల పంపిణీ జరిగిన రైతుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న కొంతమంది రైతులతో నేరుగా మాట్లాడి ఎరువుల లభ్యత, వాడకంపై మాట్లాడారు. సొసైటీ కార్యాలయంలో మొక్కలను నాటి, సొసైటీ నిర్వహణ, లాభాలు, వార్షిక లెక్కలపై సీఈవోతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీవీ పాలేం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, సొసైటీ ఐతగాని తిరపతిరావు సీఈవో సురేంద్రమోహన్‌ను సన్మానించారు.

అనంతరం ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కే సురేంద్రమోహన్ 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వర్షాలు, విపత్తులు, (మిగతా 6వ పేజీలో)

కేంద్రానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. వెంటనే యూరియా సరఫరా చేయాలి

- 3లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కేంద్రమంత్రికి లేఖ రాశాం
- యూరియా విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలు అభ్యంతరకరం
- రాజకీయాలు చేసి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారు..
- రైతుల పట్ల ఆ పార్టీ ఎంపీల మౌనమెందుకు?
- యూరియా కోసం కేంద్రానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. తీరు మారలేదు
- కొత్తగూడెంలో విలేకరులతో మంత్రి తుమ్మల


కొత్తగూడెంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఎంపీ రఘురాం

కొత్తగూడెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి కావాల్సినంత యూరియాను వెంటనే సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆగస్టు నెలాఖరు వరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాశామని గుర్తు చేశారు. అయితే కేవలం తెలంగాణలోనే యూరియా ఎరువుల కొరత ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, అర్థరహితం అని తుమ్మల ధ్వజమెత్తారు.

భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. రాష్ట్రంలోని బీజేపీ కేంద్ర మంత్రులకు సైతం యూరియా పరిస్థితి, రైతుల ఇబ్బందుల గురించి చెప్పడం జరిగిందన్నారు. కానీ వారు రాజకీయాలు చేసి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. నిజంగా తెలంగాణ రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఎంపీలు.. కేంద్ర ప్రభుత్వంతో యూరియా విషయంలో మాట్లాడకుండా ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. రైతుల కోసం యూరియా విషయంలో (మిగతా 6వ పేజీలో)



యూరియా.. ఆగయా!

- ఉమ్మడి జిల్లాలో తీరనున్న కొరత
- ఖమ్మానికి చేరుకున్న 2,646 మె.టన్నులు
- త్వరలోనే మరో 4 వేల మెట్రిక్ టన్నుల రాక

ఖమ్మం, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత తీరనుంది. జిల్లాకు ఇకపై వరుసగా రైల్ ర్యాక్‌లు రాబోతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి ఎరువుల కొరతపై పదేపదే లేఖలు రాయడంతో.. జిల్లా అవసరాలకు సరిపడా ఎరువుల కంపెనీల నుంచి (మిగతా 6వ పేజీలో)

అలర్ట్..!



- నేటి నుంచి మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ సభలు
- వేదిక కానున్న దండకారణ్యం
- అప్రమత్తమైన పోలీసులు
- దంతెవాడలో మూడు స్మారక స్తూపాల కూల్చివేత

7

బీజేపీ మతోన్మాద విధానాలకు.. వ్యతిరేకంగా పోరాడాలి

- ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థను కాపాడేందుకే పోరాటాలు
- సీపీఐ జాతీయ సభ్యుడు బాగం హేమంతరావు
- అశ్వారావుపేటలో ముగిసిన సీపీఐ భద్రాద్రి జిల్లా 3వ మహాసభలు

అశ్వారావుపేట రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు ఉన్నంతవరకు కమ్యూనిస్టుల పోరాటం కొనసాగుతుందన్నారు. అశ్వారావుపేటలో రెండు రోజులపాటు జరిగిన సీపీఐ జిల్లా మూడో మహాసభలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ ముగింపు సభకు హాజరైన బాగం హేమంతరావు మాట్లాడుతూ.. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చీలికలు తెచ్చి హిందుత్వ ఎజెండాను ప్రజలపై బలంగా రుద్దుతున్నారన్నారు. రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల సంఘాన్ని కూడా పావుగా వాడుకుంటున్నారని విమర్శించారు. బీజేపీ వల్ల కమ్యూనిస్టులకు ప్రమాదం పొంచి ఉందని, అయినా దేనికీ భయపడకుండా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నేటి చట్టసభల్లో అంతా ధనికులే ఉన్నారని, డబ్బులు వెదజల్లి ఓట్ల కొనుగోలు విధానంలో బీజేపీ ముందు వరుసలో ఉందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఏరివేస్తామంటూ వ్యాఖ్యలు చేయడం దారుణమని, అమాయకులైన ఆదివాసీలను హతమారుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఎకరాకు సాగు నీరందించాలని కోరారు. సమాజ మార్పు అనేది యువత వల్లే సాధ్యమన్నారు. పార్టీ ప్రజాసంఘాల నిర్మాణానికి ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించాలని సూచించారు. రెండో రోజు మహాసభలో పార్టీ మండల బాధ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు చర్చల్లో పాల్గొని పలు తీర్మానాలు ప్రవేశపెట్టగా.. ప్రతినిధులు ఆమోదించారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గసభ్యులు బల్లోజు అయోధ్య, విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మీకుమారి, జిల్లా నాయకులు సయ్యద్ సలీం, నారాటి ప్రసాద్, ఏపీ రాష్ట్ర కమిటీ బాధ్యులు మునీర్, జిల్లా నాయకులు సారయ్య, నరేంద్ర, ఫుల్లారెడ్డి, రవికుమార్, గన్నిన రామకృష్ణ, శ్రీనివాస్, విజయ్‌కాంత్, సాయిబాబా, రవికుమార్, రాహుల్, అజిత్‌తో పాటు నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శిగా సాబీర్‌పాషా

- మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నిక



కొత్తగూడెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) భద్రాద్రి జిల్లా కార్యదర్శిగా ఎస్‌కే.సాబీర్‌పాషా ఎన్నికయ్యారు. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాలు (మియా జానీనగర్)లో రెండో రోజు ఆదివారం జరిగిన భద్రాద్రి జిల్లా సీపీఐ మూడో మహాసభల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య సమక్షంలో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మహాసభలో సీపీఐ నూతన జిల్లా కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. 79మంది కౌన్సిల్ సభ్యులు, 27మంది కార్యవర్గసభ్యులు, మరో ముగ్గురు ఆహ్వానితులుగా 30మందితో కార్యవర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషించి విద్యార్థి కార్మిక ఉద్యమాల్లో తనదైన భూమిక పోషించిన సాబీర్ పాషా మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ చిన్ననాటి నుంచి వామపక్ష భావాజాలంతో పెరిగిన తనను పార్టీ గుర్తించిందన్నారు. తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ పురోభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

సెక్యులరిజానికి ముప్పు తెస్తున్న బీజేపీ

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

నేలకొండపల్లి, జూలై27(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో సెక్యులరిజానికి పెను ముప్పు సంభవించే ప్రమాదం ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముటాపురం గ్రామంలోని బీకేఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన సీపీఎం పాలేరు డివిజన్ వర్క్‌షాపులో తమ్మినేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సన్మతరావు అధ్యక్షతన జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద విధానాలతో ప్రజల మధ్య నిత్యం ఘర్షణలు సృష్టిస్తూ, ఓట్ల రాజకీయాలు చేస్తున్నదన్నారు. న్యాయ వ్యవస్థను సైతం తప్పుదారి పట్టిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చే కుట్రలో భాగంగానే ఓట్ల సవరణ పేరుతో బీహార్‌లో లక్షల ఓట్లను తొలగిస్తున్నదన్నారు. దేశంలోని బీసీల సంక్షేమాన్ని బీజేపీ ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి, అలివి కాని హామీలతో స్థానిక ఎన్నికల పేరుతో హడావుడి చేస్తున్నదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కేవలం రూ.8వేల కోట్లను మాత్రమే కేటాయించిన ప్రభుత్వం రూ.22,500 కోట్లను ఖర్చు చేశామని ఎలా చెబుతున్నదని ప్రశ్నించారు. నీటి వాటాల పేరుతో ప్రతిపక్ష బీఆర్ఎస్ మరోసారి సెంటిమెంటును రెచ్చగొట్టాలని చేస్తున్న ప్రయత్నాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు పార్టీ కార్యకర్తలను సిద్ధం చేయాలని తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, ఎర్రా శ్రీనివాసరావులు వర్క్‌షాపులో మాట్లాడారు. ఇంటూరి అశోక్, ఏలూరి రంగారావు, భూక్యా కృష్ణ, కొప్పుల వెంకట్రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

తెలుగు విశ్వ విద్యాలయ పుస్తక ముద్రణకు

ప్రభాకరాచార్యుల రచన ఎంపిక



అశ్వారావుపేట రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహిస్తున్న పుస్తక ముద్రణకు అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ సాహితీవేత్త సి.నా.రె పురస్కార గ్రహీత, విశ్వకర్మ లెజండరీ సిద్దాంతపు ప్రభాకరాచార్యుల రాసిన పుస్తకం ఎంపికైంది. వివిధ పత్రికల్లో ముద్రించబడిన పరిశోధన వ్యాసాలు, సెమినార్లలో సమర్పించిన పరిశోధన పత్రాలను "ప్రభాత సుమాలు"పేరుతో గ్రంథం ముద్రించుటకు విశ్వవిద్యాలయం ఎంపిక చేసింది. ఈమేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ నుంచి సాహితీవేత్త ప్రభాకరాచార్యులకు లేఖను పంపారు. గతంలో ప్రభాకరాచార్యులు రాసి న అద్దం తిరిగిన ఆదర్శాలు గ్రంథాన్ని ముద్రించగా తాజాగా ప్రభాత సుమాలు తెలుగు విశ్వవిద్యాలయ ఆర్థిక సహకారంతో ముద్రించట ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని రచయిత ప్రభాకరాచార్యులు తెలిపారు. నవంబర్‌లోగా ఈగ్రంథం పాఠకులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తన రచనలు ఎంపిక విశ్వవిద్యాలయ జ్యూరీ కమిటీకి ప్రభాకరాచార్యులు ధన్యవాదాలు తెలిపారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలు



కల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మినీ స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్ క్రీడా పోటీలు జరిగాయి. ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అథ్లెటిక్స్ విభాగం 8 సంత్సరాల నుంచి 14 సంత్సరాల వయస్సు, 16 సంత్సరాల వయస్సు గల వారికి విడివిడిగా క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందని స్థానిక స్టేడియం ఇన్‌చార్జి వీరరాఘవయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, స్థానాలలో ఎంపికైన వారికి ఆగస్టు నెల 7న జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షఫిక్ అహ్మద్, అసోసియేషన్ బాధ్యులు బి రవికుమార్, ప్రియాంక, క్రడా శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో భద్రాద్రి క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన భద్రాద్రి క్రీడాకారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో భద్రాద్రి క్రీడాకారులు మెరిశారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి క్రీడాకారులకు ఎనిమిది పతకాలు వరించాయి. హైదరాబాద్ షేక్ పేట్‌లో ముగిసిన రాష్ట్ర బాక్సింగ్ సబ్ జూనియర్స్ బాలురు, బాలికల విభాగాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తరుపున పాల్గొన్న క్రీడాకారులకు మూడు రజత, ఐదు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన వారిలో ఎ.ప్రవళిక, ఎం.హనిత్యశ్రీ, కె.అరుణ్‌కృష్ణ(రజత పతకాలు), కె.శరణ్య, కె.అమృత వర్షిణి, ఓ.సెహర్ష్‌మహంత్, వి.సాయి కిరణ్, ఆర్.గణేష్ లు(కాంస్య పతకాలు) సాధించారు. జిల్లా బాక్సింగ్ చీఫ్ ప్యాట్రన్ యెర్రా కామేష్, కోచ్ జి.ఈశ్వర్, నెహసింగ్ హర్షం వ్యక్తం చేసి ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాకారులను బాక్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య బండారి, డీవైఎస్‌వో పరందామరెడ్డిలు అభినందించారు.

భూ భారతి దరఖాస్తుల పరిశీలన

ఖమ్మం కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. గత నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలన చురుగ్గా చేపట్టారు. ఆగస్టు 14లోగా దరఖాస్తులకు ఒక పరిష్కార మార్గాన్ని చూపించే దిశగా ఈ పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని 21 రెవెన్యూ మండలాల్లో 380 రెవెన్యూ గ్రామాల్లో జూన్ 3 నుంచి 23 వర కు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వాటిలో మొత్తం 74,856 దరఖాస్తులు అందాయి. వీటి ఆన్‌లైన్ ప్రక్రియ అన్ని మండలాల్లో పూర్తి చేశా రు. సమస్యల వారీగా దరఖాస్తులను విభజించారు. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో వీటిని పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించారు. సర్వే నంబర్లు, మ్యూటేషన్లు, వివరాల సవరణ, విస్తీర్ణంలో మార్పులు, పట్టాభూమి ఉండి నిషేధిత జాబితాలో చేరిన దరఖాస్తులపై ప్రస్తుతం దృష్టి సారించారు. ఆర్ఐ డిప్యూటీ తహసీల్దార్, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి భూములను పరిశీలిస్తున్నారు. రైతుల అభిప్రాయాలు తీసుకుంటున్నారు. హద్దులను పరిశీలించి అక్కడికక్కడే మ్యాపులను సిద్ధం చేస్తున్నారు. తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను కలెక్టర్ లాగిన్‌కు పంపిస్తున్నారు. సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తుల విషయంలో ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించని కారణంగా వాటి పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అసైన్డ్ భూములకు అర్జీలకు కూడా ఇం కా నిర్ణయాన్ని తీసుకోలేదు. అయితే సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను మాత్రం ఆగస్టు 14లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రెవె న్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాకుంటే కారణాలను అర్జీదారులకు తెలియజేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సదస్సుల్లో అందిన దరఖాస్తులు ఇలా..

రెవెన్యూ గ్రామాలు	380
మొత్తం వచ్చిన దరఖాస్తులు	73,463
ప్రైవేట్ అసైన్‌మెంట్/శివాయిజమ్మేదార్	651
సాదాబైనామా	44,491
ఇతర సమస్యలు	49,071
పీవోటీ ల్యాండ్స్	1905
అటవీభూములు, రెవెన్యూ సరిహద్దు వివాదాలు	106
పోడు భూముల వివాదాలు	431
ప్రొటెక్షన్ ఆఫ్ ల్యాండ్	33
సరిహద్దు వివాదాలు	382
[illegible]	366
నేషనల్ ఖాతా పట్టా	37
[illegible]	29
పట్టాదారు పాసుపుస్తకాలు	36
ఖాతా మెర్జింగ్	13
అప్పీల్స్	31
కోర్టు వివాదాలు	36
భూదాన్ భూములు	113
అసైన్డ్ భూముల వివాదాలు	6,568
ఓఆర్సీ జారీ కానివి	57

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న

జీసీసీ చైర్మన్, సినీ దర్శకుడు

భద్రాచలం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఆదివారం రాష్ట్ర జీసీసీ చైర్మన్ కొటాంక్ తిరుపతి, అరకు ఎమ్మెల్యే రేగం మచ్చ లింగంలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొనగా వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అలాగే సినీ దర్శకులు బోయపాటి శ్రీను స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏపీలోని మోతుగూడెంలో అఖండ-2 చిత్రీకరణ జరిగిందని ముగిసిన అనంతరం రామయ్య దర్శనం కోసం రావడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఆదివారం సందర్భంగా రామాలయంలో స్వామివారికి ఆర్జిత సేవలో భాగంగా అభిషేకం, స్వర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణం నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న జీసీసీ చైర్మన్ తిరుపతి

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న చైర్మన్

దుమ్ముగూడెం జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల రాముని తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీసీసీ మేనేజర్ జయరాజు, గిరిజన సంఘాల నాయకులు పూనెం ప్రదీప్‌కుమార్, తెల్లం హరికృష్ణ తదితరులున్నారు.



రామాలయంలో సినీ దర్శకుడు బోయపాటి శ్రీను



పూజల్లో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే రేగం మచ్చలింగం

గతేడాది అనుభవాలతో.. ముందస్తు చర్యలు

(5వ పేజీ తరువాయి)

ముందస్తు చర్యలు, వైద్యసేవలు, ఎరువుల కొరత, కొత్త సొసైటీలు ఏర్పాటు అంశాలను వివరించారు. గత సంవత్సరం సెప్టెంబరులో అనూహ్యంగా మున్నేరుకు వచ్చిన వరదలు చాలా వరకు ప్రజలకు నష్టం కలిగించాయన్నారు. ఆ సమయంలో భద్రాచలంలో ఎన్డీఆర్ఎఫ్ బలగాలు ఉన్నాయన్నారు. కానీ ఈ సంవత్సరం మాత్రం నెల రోజుల క్రితం నుంచే మున్నేరు పరివాహకంలో ఒక బెటాలియన్‌ను ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బలగాలను అందుబాటులో ఉంచి ప్రజలకు భరోసా కల్పించడం జరిగిందన్నారు. 100 ఆపద మిత్రలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని తెలిపారు. అత్యవసర సమయంలో ప్రజల్ని కాపాడేందుకు పరికరాలు, వస్తువులు కొనుగోలు చేసేందుకు కలెక్టర్లకు రూ.కోటి నిధులను ఇవ్వడం జరిగిందన్నారు. నిధుల వినియోగంలో కలెక్టర్ పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకోవచ్చునన్నారు. బాధితులకు సరైన న్యాయం చేసేందుకు కలెక్టర్లు, మునిసిపాలిటీలు కమిషనర్లతో మాట్లాడి ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ఆయా ప్రాంతాల్లో ఉండే వారి వివరాలను ముందుగానే నమోదు చేస్తామన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో వ్యవసాయ సీజన్‌కు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచినట్టు కే సురేంద్రమోహన్ తెలిపారు. అయితే ప్రభుత్వం సబ్సిడీపై అందించే యూరియాను నాన్ ఎగ్రికల్చర్‌కు కొంతమంది వ్యాపారులు యూరియాను వాడుతున్నారని, ఈ విషయమై క్షేత్రస్థాయి నుంచి తాము నివేదికలు తెప్పించుకోవడం జరిగిందన్నారు. 15 రకాల వ్యాపార కంపెనీలు ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 860 యూనిట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5యూనిట్లు, ఖమ్మంలో 10 యూనిట్లు గుర్తించామన్నారు. వారు అమోనియం నైట్రేట్ బదులుగా యూరియాను వాడుతున్నారని, ఆయా యూనిట్లపై కఠినమైన కేసులు నమోదు చేసి సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నివేదికలు తెప్పించుకున్నామని, త్వరలోనే ఎఫ్ఐఆర్ కేసులు నమోదు జరుగుతాయన్నారు. యూరియాకు ఎలాంటి కొరత లేదని రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. సొసైటీ కార్యాలయాలు దూరంగా ఉంటే స్థానికంగానే గోదాములు ఏర్పాటు చేసి రైతులకు యూరియాను అందిస్తామన్నారు. కొత్త సొసైటీల ఏర్పాటుపై ప్రభుత్వం కార్యాచరణ చేస్తోందని, అక్టోబరులో ఈ మేరకు విధాన పరమైన నిర్ణయాలు జరుగుతాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైద్యశాఖను అప్రమత్తంగా ఉంచామని మలేరియా, డయోరియాపై ఇంటింటి సర్వేలు చేపట్టి వర్షాకాలంలో సీజనల్, ఇతర వ్యాధులు రాకుండా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యశాఖ అధికారులను యాక్షన్ ప్లాన్ చేశామన్నారు. వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, కిలారు రమణ, జిల్లా సహకార అధికారి గంగాధర్, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, ఏడీఏలు కొంగర వెంకటేశ్వరరావు, సరిత, ఏవో, ఏఈవోలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే.. ప్రభుత్వ ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

నిధులు విడుదల చేస్తున్నామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడానికి బ్యాంకు లింకేజీ ద్వారా రూ.లక్ష కోట్ల రుణాలను మంజూరు చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. చేప పిల్లల పంపిణీలో ఈ ఏడాది ప్రయోగాత్మకంగా మహిళా సంఘాల ద్వారా చేపల ఉత్పత్తి కేంద్రాలను స్థాపించడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా..

అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో యూరియా తక్కువ ఉన్నట్లు వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు.. విద్యాభివృద్ధికి మలుపు తిప్పే కార్యక్రమం అని అభివర్ణించారు. ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ జాగ్రత్తలు తీసుకుని ప్రస్తుతం 110ఎంఎం చేప పిల్లల పంపిణీ చేయడంతో పాటు కౌంటింగ్ ప్రకారం అందజేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుగట్లపై చెరువు సామర్థ్యం!? ఎన్నిచేప పిల్లలు పెంపకం చేపడుతున్నాం..!? వాటి ఉత్పత్తి!? వంటి పూర్తి వివరాలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో సంబంధిత బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పాటు ప్రతీ ఒక్క ఇంటి ఆవరణలో ఐదు మొక్కలను నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఉమ్మడి జిల్లాను రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలి: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి మోడల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పని చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. భద్రాచలం వద్ద గోదావరి నదీ ప్రవాహం పెరిగితే ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గోదావరి వరదలు పెరుగుతున్నాయని, ఆగస్టులో మరింత పెరిగే అవకాశం ఉందని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదలు వచ్చినప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో సరిపడినంత యూరియాను అందుబాటులోకి తీసుకొచ్చామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



సమీక్ష సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు

● ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు పని చేయాలి

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

అధికారులు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుపెట్టి సమన్వయంతో పని చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్క సంరక్షణ చేపట్టాలన్నారు. రెవెన్యూశాఖలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి ఇందిరమ్మ డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసుకుని పంపిణీ చేసే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. శ్రావణమాసం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరిగేటట్టు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ వారం ఇందిరమ్మ ఇళ్లకు నిధులను మంజూరు చేస్తోందన్నారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, పేదవారి సంక్షేమం కోసం రూపొందించిన పథకమని అన్నారు. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. రహదారుల వెంట ఏర్పడిన గుంతలను పూడ్చాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వర్షాకాలం నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని, అలా జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. వసతి గృహాలను పర్యవేక్షించడానికి ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించి ప్రతీ నెల ప్రణాళిక ద్వారా ఆస్పత్రులు, వసతి గృహాలను పరిశీలించి నివేదికలు అందజేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, మాలోత్ రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు, అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

యూరియా..ఆగయా!

(5వ పేజీ తరువాయి)

వరుసగా కేటాయింపులు జరిగాయి. ఇటీవల వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయంతో.. ఎరువుల ఎగుమతికి ఇబ్బందులు తలెత్తడంతో అక్కడక్కడ కొరత ఏర్పడింది. దీనికి తోడు భవిష్యత్‌లో యూరియా లభిస్తుందో.. లేదోనని కొందరు పెద్ద రైతులు ట్రాక్టర్ల ద్వారా ఎక్కువ సంఖ్యలో యూరియాను కొనుగోలు చేసి నిల్వ ఉంచారు. ఈ క్రమంలో వరుస వర్షాలతో పత్తి, మొక్కజొన్న నాటువేసి వరితో పాటు కరివేద వరికి కూడా యూరియా డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యంలో అక్కడక్కడ ఎరువుల కోసం రైతులు బారులు తీరుతున్నారు. ఆదివారం ఖమ్మంకు రైలు ద్వారా 2646 మె. టన్నుల యూరియా చేరింది. ఇందులో 1300మె.టన్నుల యూరియా భద్రాద్రి జిల్లాకు పంపుతుండగా.. మిగిలినది ఖమ్మం జిల్లాలో వినియోగిస్తున్నారు. రాబోయే మూడు రోజుల్లో వరుసగా 4వేల మె.టన్నుల యూరియా రైల్‌ర్యాక్‌ల ద్వారా ఉమ్మడి జిల్లాకు యూరియా రాబోతుంది. దీంతో జిల్లాలో యూరియా అవసరాలు తీరనున్నాయి. ఖమ్మం జిల్లా అవసరాల కోసం ఈసీజన్‌లో ఇప్పటి వరకు 20వేల మె.ట. యూరియా రాగా, ఇప్పటికే 15వేల మె.ట. విక్రయాలు జరిగాయి. 4వేల మె..టన్నుల యూరియా సొసైటీలు, డీలర్ల వద్ద నిల్వ ఉంది. ప్రస్తుతం వరుసగా వస్తున్న ఎరువుల ర్యాక్‌లతో జిల్లాకు యూరియా కొరత ఉండదని, రైతులకు పూర్తిస్థాయిలో సరఫరా అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆగస్టు నెలలో 15వేల మె..ట. జిల్లాలో యూరియా అవసరం ఉండనుంది. ఇందుకు సంబంధించి కూడా ఆగస్టులో రోజువారీగా యూరియాను జిల్లాకు తెప్పించేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తుంది. జిల్లాలో వరుసగా కురిసిన వర్షాలతో యూరియా డిమాండ్ పెరుగుతుంది. జిల్లాలో ఇప్పటికే సుమారు 3లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యంకాగా.. లక్షా22వేల 600 ఎకరాల్లో వరినాట్లతో పాటు కరివేద కింద రైతులు వేశారు. పత్తి 2లక్షల20వేల ఎకరాలు, మొక్కజొన్న 1500ఎకరాలు వేశారు.పెసర, కంది, మినుము పచ్చిరొట్ట ఎరువులు, కూరగాయలు,చెరుకు, కంది, జొన్న, తదితర పంటలు కలిపి ఉమ్మడి జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలు లక్ష్యం కాగా.. ఇప్పటికే 4.80క్షల ఎకరాల్లో పంటలు వేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పత్తి 2లక్షల8వేల ఎకరాలు, వరి 12817 ఎకరాలు, కంది 50 ఎకరాలు, మొక్కజొన్న 80367ఎకరాలు, పెసర 280 ఎకరాలు,ఇతర పంటలు 9వేల ఎకరాలలో వేశారు. దీనిలో ఉద్యానశాఖ నుంచి కూడా పంటలున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎరువుల డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఇటీవల వర్షాల కారణంగా ఎరువుల రాకపోవడంతో ఇబ్బంది ఏర్పడడంతో అక్కడక్కడ ఎరువుల కొరత నెలకొంది. జిల్లాలో సహకార సంఘాలకు 60శాతం, డీలర్లకు 40శాతం చొప్పున యూరియాను పంపిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో కూడా ఇప్పటి వరకు 15,680మె.ట.కుగాను ఇప్పటి వరకు 11,021మెట.. రావడంజరిగింది. గతంలో సుమారు 4వేల మె.ట. ఉన్న నిలవలున్నాయి. వరుసగా ఖమ్మం వస్తున్న ఎరువుల ర్యాక్‌లు జిల్లాకు కూడా రాబోతున్నాయి. ఆగస్టు నెలలో కూడా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 15వేల మె.ట.యూరియా డిమాండ్ ఉంది. ఇందుకు అనుగుణంగా జిల్లాకు సరిపడా ఎరువులు తెప్పిస్తున్నాని జిల్లా వ్యవసాయాధికారి బాబురావు తెలిపారు. మొక్కజొన్నకు యూరియా ఎక్కువగా వినియోగిస్తున్నారని జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరతలేదని తెలిపారు. మొత్తంమీద రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఎరువులు వస్తున్నందున సమస్య తాత్కాలికంగా తీరనుంది. ఆగస్టులో ఉమ్మడిజిల్లాలో వరి,పత్తి, మిర్చి తదితర పంటల అవసరాలున్నందున సుమారు 30వేలమె.ట.యూరియా డిమాండ్ ఉంది. ఇందుకు అనుగుణంగా ఉభయ జిల్లాల వ్యవసాయాధికారులు ఎరువుల దిగుమతికి ఇప్పటినుంచే కసరత్తు చేస్తున్నారు.

కేంద్రానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే..

వెంటనే యూరియా సరఫరా చేయాలి

(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్ర ప్రభుత్వ తీరు మారలేదన్నారు. ఈ నెల నుంచి జూలై వరకు యూరియా ఎలార్ట్‌మెంట్ 6.6లక్షల మెట్రిక్ టన్నులు అయినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం 4.23లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే సరఫరా చేసిందని, ఇంకా 2.37లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయలేదన్నారు. ఎలార్ట్‌మెంట్ చేసిన యూరియాను కేంద్ర ప్రభుత్వం సకాలంలో అందించలేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం యూరియా విషయంలో కేంద్ర ఎరువుల శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ.. కేంద్రం రైతులకు యూరియాను అందించలేకపోయిందన్నారు. నిజంగా రైతాంగం పట్ల అభిమానం ఉంటే తెలంగాణ బీజేపీ రాష్ట్ర నాయకులు యూరియా సరఫరా చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులకు యూరియా అందకపోవడం వల్ల తీవ్ర సంక్షోభం నెలకొనడంతో.. కేంద్ర ప్రభుత్వం తక్షణమే సరఫరా విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 1.16కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని.. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలకు యూరియా అత్యంత అవసరమన్నారు. యూరియా లోడ్ వల్ల సాగుప్రక్రియకు అంతరాయం ఏర్పడి పంట దిగుబడి నాణ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని అవసరమైన యూరియాను సమయానికి సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ఇప్పటి వరకు అందించిన యూరియా సహాయానికి కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతూ.. రైతులకు మద్దతుగా మరింత సహకారం అందించాలని కోరినట్లుగా లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ పాల్గొన్నారు.

రేపు ఏకో పార్కును సందర్శించనున్న బలరాం


సింగరేణి చైర్మన్ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) జూలై 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఏకో పార్కును సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం మంగళవారం సందర్శించనున్నారు. తేనెటీగల పెంపకంపై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా తేనెటీగలు పెంచే బాక్సులను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. చైర్మన్‌తో పాటు సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రో, డైరెక్టర్లు ఎల్‌వీ.సూర్యనారాయణ, కే.వెంకటేశ్వర్లు, సత్యనారాయణరావు, జీఎం షాలెం తదితరులు హాజరుకానున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ముగ్గురు ఎంపిక


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన యువకులు

జూలూరుపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగే యోగా పోటీలకు మండలంలోని పాపకొల్లు, వెంగన్నపాలెం గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు ఎంపికయ్యారు. ఆదివారం కొత్తగూడెంలో యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ వారి ఆధ్వర్యంలో 6వ భద్రాద్రి జిల్లాస్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అండర్-35 విభాగంలో పాపకొల్లు గ్రామానికి చెందిన రాయి బసవయ్య, వెంగన్నపాలెం గ్రామానికి చెందిన వేల్పుల బోసు, పెండ్యాల నరేష్‌లు యోగాసనాలతో ప్రతిభను చాటుకున్నారు. బసవయ్య జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతిని సాధించి గోల్డ్‌మెడల్‌ను, బోసు తృతీయ బహుమతి సిల్వర్ మెడల్‌ను సాధించగా పెండ్యాల నరేష్ 4వ బహుమతిని కైవసం చేసుకున్నారు. అదిలాబాద్‌లో ఆగస్టు 7, 8వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ముగ్గురు యువకులను నిర్వాహకులు ఎంపికచేశారు. ఎంపికైన యువకులను జూలూరుపాడు ఆరోగ్యజీవన యాత్ర బృందం(వాకర్స్ క్లబ్) సభ్యులు అభినందించారు.

లయన్ శివప్రసాద్‌కు డాక్టరేట్

సామాజిక సేవలకు గుర్తింపు


డాక్టరేట్ పొందిన సీహెచ్ శివప్రసాద్

చుంచుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలు అందిస్తున్న కొత్తగూడెం మిలీనియం లయన్స్ క్లబ్‌కు మాజీ జిల్లా గవర్నర్, వ్యాపార వేత్త లయన్ సీహెచ్.వి.శివప్రసాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఆదివారం గౌరవం లభించింది. ఢిల్లీలో ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా శివకుమార్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ సోషల్ వర్క్ రంగాల్లో చేస్తున్న విశేష సేవలకు గాను అమెరికాలోని బర్లింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ వారు హానరిస్ కాసా డాక్టరేట్‌తో పాటు గోల్డ్ మెడల్‌ను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ లారా చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ డాక్టరేట్ పొందడం తన బాధ్యతను మరింత పెరిగిందని, రాబోయే రోజుల్లో తన సేవలు మరింత విస్తృతం చేస్తానని శివప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌కు డాక్టరేట్ రావడం భద్రాద్రి జిల్లాకే గర్వకారణంగా ఉందని పలువురు సామాజిక, వ్యాపార వేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కోటమైసమ్మ తల్లి ఆలయంలో వేలం పాట

కారేపల్లి జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయంలో సోమవారం వేలం పాటలు ఉన్నాయని ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో వేణుగోలచార్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దసరా పండగ సందర్భంగా కొబ్బరికాయల విక్రయాలకు సంబంధించి వేలం పాటలు నిర్వహిస్తారని తెలిపారు. వేలం ఉదయం 11 గంటలకు ఆలయం ప్రాంగణంలోనే జరుగుతాయని, పాటదారులు పాల్గొన్నాలన్నారు.

సొంతింటి కలకు ధరల దెబ్బ!

పెరిగిన ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు
ఇందిరమ్మ లబ్ధిదారుల్లో అయోమయం
ఎలా కట్టుకోవాలో తెలియక ఆందోళన


అనంతారంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్న లబ్ధిదారులు

జూలూరుపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ముడి సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఆందోళన కలుగుతుంది. ఇళ్లు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా అధికారులు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంతో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వారికి ఇళ్ల పట్టాలను అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో అవాక్కవుతున్నారు. మండలంలోని 24 పంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకి 3,506 మందిని అర్హులుగా గుర్తించారు. మొదటి విడతలో 565 మందిని ఇందిరమ్మ లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. మొదటి దశలో అనంతారం పంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి 84 మందికి ఇళ్లను మంజూరీ చేశారు. మిగిలిన 481 మందికి విడతల వారీగా పట్టాలు అందజేశారు.

లబ్ధిదారులకు ధరాఘాతం

పట్టాలు అందుకున్న లబ్ధిదారుల్లో సొంతింటి కళ నేరవేరబోతుందన్నా ఆనందంపై సామగ్రి ధరల పెరుగుదల నీళ్లు చల్లాయి. గతంలో నిర్మాణ సామగ్రి ధరలకు, ప్రస్తుత ధరలకు చాలా వ్యత్యాసం ఉంది. గతంలో సిమెంట్ బస్తా ధర రూ.270లు ఉండగా ప్రస్తుతం రూ.350లకు పెరిగింది. ఇసుక టన్ను రూ.800 ఉండగా ప్రస్తుతం రెట్టింపు ధర రూ.1600కు పెరిగింది. ఇనుము టన్ను రూ.63వేల నుంచి రూ.68 వేలకు పెరిగింది. సిమెంట్ ఇటుక రూ.30లు ఉండగా ఇప్పుడు రూ.36లు పలుకుతుంది. ఇదిలా ఉండగా నిర్మాణ పనులు చేపట్టే మేస్త్రీ, కూలీల ధరలు విపరీతంగా పెరిగాయి. నిన్నమొన్నటి వరకు ఒక చదరపు అడుగు నిర్మాణానికి రూ.250లు ఉండగా ప్రస్తుతం రూ.350గా ఉంది. పెరిగిన ధరలతో ఇళ్ల నిర్మాణాలను ఎలా చేపట్టాలని లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు.

పెరిగిన ధరలతో అయోమయం

దొడ్డా రేవతి, లబ్ధిదారురాలు మొద్దులగూడెం



సొంతింటి కళ నెరవేరుతుందని సంతోషించాలో, ముడి సామగ్రి ధరలను చూసి బాధపడాలో తెలియని పరిస్థితిలో పడిపోయాం. గత ఏడాదికి ప్రస్తుతానికే ధరల్లో విపరీతమైన తేడా వచ్చింది. పేదలు అందుకోలేనంతగా సామగ్రి ధరలు పెరిగి ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇంటిల్లపాది కష్టపడి దాసుకున్న డబ్బు కూలీల ఖర్చులు తప్పుతాయని అనిపిస్తుంది.

నిర్మాణ వ్యయం ఆందోళన కలిగిస్తుంది

పూనెం కృష్ణకుమారి, అనంతారం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ వ్యయం ఆందోళన కలిగిస్తుంది. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నప్పటికీ ధరల పెరుగుదలతో ఇంటి నిర్మాణానికి అవి సరిపోవడంలేదు. మరో రూ.3 నుంచి రూ. 4 లక్షలు ఖర్చు పెట్టాల్సివస్తుంది. ధరల పెరుగుదలతో ఇంటి నిర్మాణ వ్యయం పెరిగి పోతుంది. ధరలను ప్రభుత్వం నియంత్రణ చేయాలని కోరుతున్నాం.

క్రీడల్లో ప్రతిభ చూపాలి

క్రీడా శాఖ మంత్రి శ్రీహరికి క్రీడాకారుల స్వాగతం
క్రీడా స్టాల్స్‌ను పరిశీలించిన మంత్రి
కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు
ఎమ్మెల్యేలు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు


స్టాళ్లను పరిశీలిస్తున్న క్రీడల, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీహరి, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, రెండు జిల్లాల కలెక్టర్లు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్రానికి పతకాలు తీసుకురావాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. ఆదివారం ఆయన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ హోదాలో తొలిసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విచ్చేశారు. మంత్రికి జిల్లాలోని వివిధ క్రీడా అసోసియేషన్స్, క్రీడాకారులు డీవైఎస్‌వో పరందామరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. డీవైఎస్‌వో కార్యాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి స్టాల్స్‌ను పరిశీలించారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, సైక్లింగ్, బాక్సింగ్, థైక్వాండో, కరాటే, కబడ్డీ, రెజ్లింగ్, సాఫ్ట్ బాల్, వెయిట్ లిఫ్టింగ్ స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలను స్వయంగా పరిశీలించారు. క్రీడల్లో ప్రతిభ చాటి, పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మంత్రి వెంట డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మాలోత్ రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావ్, భద్రాద్రి, ఖమ్మం జిల్లా కలెక్టర్లు జితేష్ వి పాటిల్, అనుదీప్ దురిశెట్టి, జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్వామిత్రకు ఎన్విరాన్మెంట్ ఐకాన్ అవార్డు


విశ్వామిత్రకు ఎన్విరాన్మెంట్ ఐకాన్ అవార్డు ప్రదానం చేసిన నిర్వాహకులు


అవార్డు గ్రహీత చిన్నారి విశ్వామిత్ర

చుంచుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తూ 'వాక్ ఫర్ ట్రీస్' కాన్సెప్ట్‌తో మొక్కలు నాటుతున్న చిన్నారి విశ్వామిత్ర చౌహాన్‌కు ఎన్విరాన్మెంట్ ఐకాన్ అవార్డును ప్రముఖ సినీనటి ప్రణీత సుభాష్ చేతుల మీదుగా హైదారాబాద్‌లో ఆదివారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఇటీవల విశ్వామిత్ర ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాధించుకున్నాడు. ప్రకృతి ప్రేమికుడు విశ్వామిత్ర చౌహాన్ సేవలకు గాను తెలంగాణ బిజినెస్ గ్లోబెల్ అవార్డు-2025 నిర్వాహకులు రాష్ట్రంలోని ప్రముఖ వ్యాపారవేత్తలకు ఇచ్చే తెలంగాణ గ్లోబల్ అవార్డును చిన్నారి విశ్వామిత్రకు పార్క్ హోటల్‌లో ప్రధానం చేశారు. చిన్న వయసులో సమాజం పట్ల ఉన్న అవగాహన గుర్తించి అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తపిస్తున్న చిన్నారిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా చుంచుపల్లి మండల వాసికి అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కమ్మ కులంపై దుర్మార్గపు మాటలు బాధాకరం

ఖండించిన కమ్మ మహాజన సంఘం నాయకులు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి):తెలంగాణకు చెందిన బీఆర్‌ఎస్ నేత కమ్మ కులంపై విమర్శలు చేసినట్టుగా ప్రచారం అవుతున్న దుర్మార్గపు మాటలు బాధాకరమని, ఈ వ్యాఖ్యలను ఖమ్మం కమ్మ మహాజన సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటనలో తెలిపారు. కమ్మ కులంపై బీఆర్ఎస్ నేత చేసినట్టుగా చెబుతున్న వ్యాఖ్యలు తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ఏపీకి చెందిన ఓ ఎంపీతో బీఆర్ఎస్ నేత ఒకరు కమ్మ కులంపై దారుణంగా మాట్లాడారని సామాజిక మాధ్యమాల్లో చర్చ సాగుతోందన్నారు. సదరు బీఆర్ఎస్ నేత ఆ వ్యాఖ్యలు చేసిఉంటే వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కమ్మ కులం అనేది దేశ అభివృద్ధికి, రాష్ట్ర ప్రగతికి, అన్ని రంగాల్లో నిస్వార్థంగా సేవలందించిన సామాజిక వర్గమన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం, రాజకీయాలతో పాటు ప్రజాసేవ వరకు కమ్మ కులం నుంచే అనేక మంది ప్రతినిధులు తమ పాత్రను విధిగా నిర్వహించారని.. ఇంకా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఏ రాజకీయ పార్టీలో ఎవరున్నా కులాలపై విమర్శలు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం అనవసరమన్నారు. ఇలాంటి విమర్శలు సమాజాన్ని రెచ్చగొట్టి ఐక్యతను దెబ్బ తీస్తాయని గుర్తు చేశారు. రాజకీయాల్లో కులాలపై వ్యాఖ్యలు చేయడం ప్రమాదకరమని, కమ్మ కులంపై అలా విమర్శలు చేయడాన్ని తాము ఖండిస్తున్నట్టు తెలిపారు. అన్ని కులాలను సమాజంలో అందరూ గౌరవించుకోవడం అలవర్చుకోవాలని, తద్వారా ప్రజాస్వామ్యానికి గౌరవం చేకూరుతుందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము పేర్కొన్నారు.

వేంసూరు మండలంలో దొంగల హల్‌చల్

వేంసూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వేంసూరు గ్రామానికి చెందిన మల్లెల్లి రాంప్రసాద్ ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.ఐదు వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే అడసర్లపాడు గ్రామంలో కాసర చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్ టైర్లు రెండు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా ఐదుగురు రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటర్లకు ఉన్న కేబుల్ వైర్లను అపహరించారు. ఈమేరకు బాధితులు వేంసూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

కారేపల్లి జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కామేపల్లి మండలం పరిధిలోని ఖమ్మం, ఇల్లెందు ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి మండలం గిద్దవారి గూడెం గ్రామానికి చెందిన గుగులోత్ రాజశేఖర్, రఘునాథపాలెం మండలం బుడెదంపాడు గ్రామానికి చెందిన కేళోత్ మంగీలాల్‌తో కలిసి మోటరు సైకిల్‌పై ఖమ్మం వైపు వెళ్తున్నారు. ముచ్చర్ల, కొత్తలింగాల స్టేజీ మార్గమధ్యలో నర్సరీ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తలకు తీవ్రగాయాలు కాగా మంగీలాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న కామేపల్లి పోలీసులు క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రూ.25.700 నగదు స్వాధీనం

కారేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామం శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయ పరిసర ప్రాంతాల్లో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. దాడిలో ఆరు మోటార్‌సైకిళ్లు, 9 సెల్‌ఫోన్లతో పాటు రూ.25,700 నగదును స్వాధీనం చేసుకుని 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

కారు ఢీకొని నలుగురు యువకులకు గాయాలు

వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించాలని
ట్రాఫిక్ ఆర్ఐ సాంబశివరావుకు మంత్రి పొంగులేటి ఆదేశాలు


క్షతగాత్రులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం బైపాస్‌రోడ్, జూలై27 (ఆంధ్రజ్యోతి): ఆపదలోనూ నేనున్నా అని మరోమారు చాటుకున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. వైరారోడ్డులోని ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో ఆదివారం సాయంత్రం కారు ఢీకొన్న ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమయంలో కొత్తగూడెం పర్యటన ముగించుకొని ఖమ్మం క్యాంపు కార్యాలయానికి వస్తున్న మంత్రి పొంగులేటి ఆ ఘటనను చూసి కాన్వాయ్‌ను ఆపారు. అధైర్యపడొద్దని, నేనున్నానని గాయపడిన యువకులకు భరోసా ఇచ్చారు. అక్కడే ఉన్న ట్రాఫిక్ ఆర్ఐ సాంబశివరావును దగ్గరకు పిలిచి క్షతగాత్రులను త్వరగా కిమ్స్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. పైసా ఖర్చులేకుండా మెరుగైన వైద్యం అందించాలని ఫోన్‌ద్వారా వైద్యులను ఆదేశించారు.

అలర్ట్..!

నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల సంస్మరణ సభలు

వేదిక కానున్న దండకారణ్యం
అప్రమత్తమైన పోలీసులు
అడవుల్లో గాలింపు
దంతెవాడలో మూడు స్మారక స్తూపాల కూల్చివేత

స్తూపాల కూల్చివేత

ఛత్తీస్‌గడ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా కచ్చెనార్ గ్రామంలో ఆదివారం మావోయిస్టు పార్టీకి చెందిన మూడు స్మారక స్తూపాలను కేంద్రబలగాలు కూల్చివేశాయి. వీటిలో రెండు చెక్కతో తయారు చేయగా.. మరొకటి సిమెంట్‌తో తయారు చేశారు. వార్షికోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు వీటిని తయారు చేశారని పోలీసులు చెబుతున్నారు.




కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సోమవారం నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ సభలను నిర్వహించనుంది. పార్టీలో పనిచేస్తూ అసువులు బాసిన నాయకుల కోసం ఈ వారోత్సవాలను ప్రతీ ఏటా మావోయిస్టు పార్టీ నిర్వహిస్తూ వస్తోంది. ఈ సందర్భంగా పార్టీ దిశా నిర్దేశం, సభలు, సమావేశాలు కొనసాగుతాయి. ఈ కార్యక్రమాలన్నింటికీ దండకారణ్యం వేదిక కానుంది. గతంలో పార్టీలో జరిగిన లోటు పాట్లను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రచించుకోనున్నారు. కాగా.. ఈ ఏడాది సుమారు 357పైగా మావోయిస్టులు మృతి చెందారు. వారిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు కూడా ఉన్నాడు. ఈ సంస్మరణ సభల్లో మృతి చెందిన వారిని పార్టీ స్మరించుకునే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు.. మావోయిస్టు పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించుకునే వారోత్సవాలను తిప్పికొట్టాలని పోలీసులు అడుగులు వేస్తున్నారు. గ్రామాల్లో తనిఖీలు చేస్తూ, అడవుల్లో కూంబింగ్‌లు నిర్వహిస్తున్నారు. మావోయిస్టులు వారి ఉనికి చాటుకోవడం కోసం ఏదైనా విధ్వంసకర ఘటనలకు పాల్పడే అవకాశం ఉండడంతో.. పట్టణ, పల్లెల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఛత్తీస్‌గడ్‌కి వెళ్లే రహదారులను పోలీసులు వారి ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన కల్వర్టులు, నూతనంగా నిర్మించిన రహదారులను బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. చర్ల మండలంలో సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ తనిఖీల్లో పాల్గొంటున్నారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేస్తున్నారు. అలాగే వెంకటాపురం, వాజేడు మండలాల్లో కూడా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో మావోయిస్టు హిట్ లిస్టులో ఉన్న వారిని సురక్షితంగా ఉండాలని సూచిస్తున్నారు.

నాయకులు లేకుండానే..

ఈ ఏడాది ఆపరేషన్ కగార్‌లో భాగంగా 357కి పైగా మావోయిస్టులు మృతి చెందారు. 400మందికి పైగా లొంగిపోయారు. 70 మందికి పైగా అరెస్టు అయ్యారు. దీంతో పార్టీ క్యాడర్ వీక్ అయినట్లు పోలీసులు చెబుతున్నారు. 2023లో మావోయిస్టు పార్టీ ఘనంగా సంస్మరణ సభలను నిర్వహించింది. సుమారు 1000 మందికి పైగా మావోయిస్టులు పాల్గొన్నారు. 2024నుంచి ఆపరేషన్ కగార్ నడుస్తోంది. రెండు సంవత్సరాల్లోనే 700 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పార్టీని నడిపించే నాయకులు ఉన్నారా!? అన్న సందేహం సర్వత్రా కలుగుతోంది. అయితే మావోయిస్టు పార్టీ సంస్మరణ సభలు నిర్వహించాలని పార్టీ లేఖల ద్వారా పిలుపునిచ్చింది.

భద్రాద్రి ఉపాధ్యాయుడికి 'బంగారు నంది'..

భద్రాచలం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంకు చెందిన ఉపాధ్యాయుడు, కవి, సాహితీవేత్త తోటమల్ల సురేష్‌బాబును హైదరాబాద్‌కు చెందిన 'రుద్ర బెస్ట్ హెల్పింగ్ ఫౌండేషన్' సంస్థ బంగారు నంది ఆల్ ఇన్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును ఆగస్టు 10న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో సినీ ప్రముఖల చేతుల మీదుగా అందిస్తారని తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచే వారిని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారని, ఇందులో భాగంగా తనను ఎంపిక చేసినట్లు సమాచారం ఇచ్చారని సురేష్ తెలిపారు. ఉపాధ్యాయుడు సురేష్‌కు అవార్డు రావడం పట్ల పీఆర్‌టీయు రాష్ట్ర నాయకులు దనుకొండ శ్రీనివాసరావు, కృష్ణ పటేల్ , లక్ష్మీనారాయణ, పొడపాటి శ్రీనివాసరావు అభినందించారు.

విపత్తుల సమయంలో ఇదేం శిక్షణ

డీఆర్‌ఎఫ్ బలగాలకు పది రోజుల శిక్షణ..
నివ్వెరపోతున్న కార్పొరేటర్లు


శిక్షణ ఇస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత 20 రోజులుగా ఖమ్మం నగరంలో ఎన్డీఆర్‌ఎఫ్ బలగాలు మున్నేరు పరివాహక ప్రాంతంలోని ముంపు ప్రజలకు వరదల సమయంలో ఆస్థి, ప్రాణనష్టం లేకుండా చూడడంపై శిక్షణ కార్యక్రమాలు ఇచ్చారు. గత మూడు రోజులుగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో మున్నేరుకు వరద పోటు పెరుగుతోంది. ఇటీవల మున్నేరు నీటి మట్టం 10.50 అడుగుల వరకు వచ్చింది. ఆకేరు, బుగ్గవాగుకు వరద పెరిగితే మున్నేరుకు ఏ క్షణమైన వరద తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బలగాలకు అండగా ఉండాల్సిన ఖమ్మం నగర పాలక సంస్థ పర్యవేక్షణలో ఉండే డీఆర్‌ఎఫ్ బలగాలకు ఆదివారం నుంచి పది రోజుల శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. శిక్షణ పేరుతో వారిని బయటకు రాకుండా చేస్తే విపత్తులు, భారీ వర్షాల సమయంలో డీఆర్‌ఎఫ్ బలగాలు లేని ప్రభావం ఖమ్మం నగరంలో తీవ్రంగా కనిపిస్తోంది. రెండు బృందాల్లో 21 మంది సభ్యులుండగా అందరికీ ఒకే సమయంలో శిక్షణ ఇవ్వడం విమర్శలకు దారి తీస్తోంది. అయితే డీఆర్‌ఎఫ్ బలగాలకు శిక్షణ ఇచ్చే హైదరాబాద్ ఏజెన్సీ ఆలస్యంగా రావటంతో ఇప్పుడు శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఈ విషయంపై కేఎంసీ డీఆర్ఫ్ ఇంచార్జీ బెల్లం రాధికను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా డీఆర్‌ఎఫ్ బలగాలు శిక్షణలో ఉన్నా కూడా అత్యవసరమైతే వారిని బయటకు పంపుతామని తెలిపారు. ఏది ఏమైనా విపత్తులకు ముందు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకోవాల్సిన డీఆర్‌ఎఫ్ బలగాలు విపత్తుల సమయంలో 10 రోజులు పాటు శిక్షణలు ఇవ్వటంపై కార్పొరేటర్లు సైతం నివ్వెరపోతున్నారు.



జాతీయ సదస్సుకు ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం

తిరుమలాయపాలెం, జూలై27 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానం- 2020 ఐదో వార్షికోత్సవం ఢిల్లీలో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. జూలై 29న జాతీయ విద్యావిధానంపై జరిగే ఈసదస్సును ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. దీనిలో భాగంగా తిరుమలాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నేషనల్ మిషన్ ఫర్ మానిటరింగ్‌సభ్యుడు పెసర ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం అందించింది. కేంద్ర విద్యామంత్రిత్వశాఖ తరుపు సెక్రటరీ సందీప్‌కుమార్ ఆహ్వానం పంపారు.

వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

ఖమ్మంమార్కెట్,జూలై27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను ఆదివారం జిల్లా ప్రత్యేకాధికారి, మార్కెటింగ్‌శాఖ సంచాలకులు సురేంద్రమోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులను పున:నిర్మాణ పనులను పరిశీలించారు. షెడ్‌లను త్వరితగతిన నిర్మించి రాబోయే మిర్చి సీజన్‌కల్లా రైతులకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు, వైస్‌ఛైర్మన్ తల్లాడ రమేష్, డైరక్టర్ లతీఫ్, డీఎంవో హలీమ్, మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి. కిరణ్‌కుమార్, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళలను బతికించడం ప్రతీ ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు కళల ద్వారా మాత్రమే పరిపూర్ణం అవుతాయని, ఏ దేశ ప్రజలు ఆ దేశ చరిత్రను మరిచిపోతారో ఆ జాతి మనుగడ కష్టమవుతుందని అందుకే ప్రతి ఒక్కరు కళలను బతికించేందుకు కృషి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కిడ్నాప్ నాటిక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పురాణ ఇతిహాసాల నుంచి పౌరాణిక, సాంఘీక నాటికల వరకు అన్ని ప్రజలు ఆరాధించారని, అభిమానించారని అన్నారు. నేటి సినిమా, టీవీలు కలుషితం చేస్తున్నా కళల నుంచి ఇలాంటి కార్యక్రమాలతో ప్రజలకు మంచి నాటికలు అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ముందుగా ప్రదర్శించిన కిడ్నాప్ నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి కాళ్ల పాపారావు, అనురాధ, వెంకటేశ్వరరావు, నిర్వాహకులు సుబ్రమణ్య కుమార్, జగన్మోహన్‌రావు, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



జూపెడలో ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, జూలై27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలు మృతుల కుటుంబాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించిన నగదును ఆదివారం నాయకులు అందించారు. మండలంలోని కొక్కిరేణి, పిండిప్రోలు, దమ్మాయిగూడెం, తెట్టెలపాడు, పాతర్లపాడు చంద్రుతండా. జూపెడ, కేశ్వాపురం తదితర గ్రామాల్లో 14మంది మృతుల కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికీ రూ.10వేల వంతున జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ అందించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బెల్లం శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్, నాయకులు ఉన్నం రాజశేఖర్, చీమ లక్ష్మయ్య, జి.అంబేద్కర్, టి.కిరణ్, గోళ్ల లింగయ్య, పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు సర్వే తప్పనిసరి

సత్తుపల్లి, జూలై27 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి సర్వే తప్పనిసరిగా చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.టీ. సీతారామ్ సూచించారు. ఆదివారం ఆయన ఆకస్మికంగా మండలంలోని గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, మందులు స్టాక్, రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆశాలు, ఏఎన్‌ఎంలతో ఇంటింటా వివరాలు సేకరించి జ్వరపీడితులను గుర్తించాలని, నిర్ధారణ అయిన వారి చుట్టుపక్కల ప్రతిఒక్కరికీ పరీక్షలు చేసి మందులను అందజేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగీలతో పాటు సీజనల్ వ్యాధులను కట్టడి చేయడానికి ప్రయత్నించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో వ్యాధుల నియంత్రణలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాత్ర కీలకంగా ఉండేలా అధికారులు జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆర్. అవినాష్, స్పందన, సూపర్‌వైజర్ శారారాణి, సిబ్బంది ఉన్నారు.

విషజ్వరాలపై సర్వే



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తిరుమలాయపాలెం, జూలై27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణతండా, బీసరాసిపల్లి, బలరాంతండా తదితర గ్రామాల్లో ఆదివారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విషజ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఏఎన్‌ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో తండాలో ఇంటింటి సర్వేనిర్వహించారు. రక్తనమూనాలు సేకరించారు. జ్వరపీడితులకు మందులు అందించారు. అలాగే తండాల్లో వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల సందడి





ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శ్రావణ మాస బోనాల జాతర ఉమ్మడి ఖమ్మం నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం ఉదయం మహిల భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలుసమర్పించారు. జిల్లాలోని గంగమ్మ, పోచమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ ఆలయాలలో బోనాలతో పల్లె, పట్నం అనే తేడాలేకుండా ప్రతి చోటా బోనాన్ని ఎత్తుకోనున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో జిల్లా ప్రజలు బోనాల్లో మునిగి తేలారు. ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్ ముత్యాలమ్మఆలయం, వరదయ్య నగర్‌లోని మైసమ్మ తల్లి ఆలయం, రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయంతోపాటు పలు అమ్మవార్ల ఆలయాలలో శ్రావణమాస బోనాలుఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని చర్చికాంపౌండ్ ముత్యాలమ్మ అమ్మవారికి రజకసంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. శ్రావణమాసం మొదటి ఆదివారం మొట్టమొదటి బోనాలను రజక కులస్తులు అందించడం ఆనవాయితీగా వస్తుంది. ఈబోనాలు కార్యక్రమానికి 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి దంపతులు హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించారు. వరదయ్యనగర్‌లోని మైసమ్మతల్లి ఆలయంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించారు.



పూజలు చేస్తున్న భక్తులు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



రేపు ఖమ్మంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

ఖమ్మంబైపాస్‌రోడ్, జూలై27(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు ఈనెల 29న ఖమ్మం పర్యటనకు రానున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 29న ఉదయం 8గంటలకు నాయకన్‌గూడెం టోల్‌ప్లాజా వద్ద ఆయనకు బీజేపీ శ్రేణులు స్వాగతం పలుకుతారని, అక్కడి నుండి కూసుమంచిలోని శివాలయంకు 9గంటలకు చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారుక. అనంతరం 10గంటలకు నగరంలోని కాల్వొడ్డు నుండి నిర్వహించే బైక్ ర్యాలీలో పాల్గొంటారని, తర్వాత నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో 11గంటలకు నిర్వహించే పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. మధ్యాహ్నం 2గంటలకు సూర్యతేజ హోటల్‌లో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారని ఆయన



మాట్లాడుతున్న నెల్లూరి కోటేశ్వరరావు

పేర్కొన్నారు. ఈసమావేశంలో బీజేపీ నాయులు గెంటేల విద్యాసాగర్‌రావు, నంబూరి రామలింగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పింఛన్ పథకం ప్రవేశపెట్టాలి



ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై27 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని నితీష్‌కుమార్ ప్రభుత్వం జర్నలిస్టులకు అమలుచేస్తున్న పింఛన్ పథకాన్ని తెలంగణ రాష్ట్రంలో కూడా అమలుచేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఖమ్మంజిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బీహార్, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పింఛన్ పథకాన్ని అమలుచేసి జర్నరలిస్టుల సంక్షేమానికి అక్కడి ప్రభుత్వాలు భరోసాగా ఉంటున్నాయని, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షు డు ఏనుగు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు ఆదివారం ఒకప్రకటనలో కోరారు. బీహార్‌లో జర్నరలిస్టులకు నెలకు రూ.15వేలు పింఛన్ పథకాన్ని పెంచుతూ నితీష్‌కుమార్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణలో కూడా జర్నలిస్టులకు పింఛన్, ఇండ్లస్థలాలు, అక్రిడేషన్, కార్పొరేట్ విద్యా, వైద్య పథకం, జర్నలిస్టులకు జీవీత బీమా పథకాలు అమలుచేసి జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని వారు సూచించారు. ఇందుకోసం యూనియన్‌పరంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటనలో తెలిపారు.

ముదిగొండ భూపోరాటానికి 18ఏళ్లు

ముదిగొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ముదిగొండ కాల్పుల సంఘటన జరిగి నేటికీ 18ఏళ్లు పూర్తయింది. జానెడు జాగ కోసం శాంతియుతంగా ఆందోళన చెందుతున్న వారిపై పోలీసులు విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఏడుగురు మృతిచెందగా, 23మందికి బుల్లెట్ గాయాలయ్యాయి. భూపోరాట అమరవీరుల స్థూపం వద్ద సోమవారం 18వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం తెలిపారు. ఈ వర్ధంతి సభకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొంటారని సీపీఎం నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

▸▸ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం అమలులో లేకపోవడంతో కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను దోచుకుతింటున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ ఆరోపించారు. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పరిపాలన జరిగినా నేటి వరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ వైఫల్యం దిశగా ఉందని ఆరోపించారు. విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అచరిస్తోందని విమర్శించారు. ఈకార్యక్రమంలో నాయకులు వంగూరి వెంకటేష్, లక్ష్మణ్, సాధిక్, వినయ్, యశ్వంత్, శశికిరణ్; సందీప్, సురేశ్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంపాటి పృథ్వీ

భద్రాద్రి బ్యాంక్ 28వ వార్షిక సర్వసభ్య సమావేశం



జ్యోతిప్రజల్వన చేస్తున్న హైకోర్టు న్యాయాధికారి రాజేశ్వరరావు, చైర్మన్ కృష్ణమూర్తి

ఖమ్మం మార్కెట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కో-ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ 28వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఖమ్మం డాబాల బజార్‌లోని వాసవీకళ్యాణ మండపంలో జరిగింది. ఈ మహాజన సభకు బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయాధికారి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, విశిష్ఠ అతిథిగా జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకారశాఖ అధికారి గట్టు గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక నివేదికను, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జట్‌ను సభ్యుల ముందు ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ముగిసిన మార్చి31 నాటికి డిపాజిట్లు రూ.598.99 కోట్లకు గాను రుణములు రూ. 365.99 కోట్లకుగాను బ్యాంక్ నికర లాభం రూ.880.31 లక్షలకుగాను ఉన్నాయని తెలిపారు. ఇప్పటికి 23 శాఖలుగా విస్తరించినదని, రాబోవు రోజుల్లో మరిన్ని శాఖలను ప్రారంభిస్తామని తెలిపారు. మొత్తం 23,537 మంది సభ్యులతో బ్యాంక్ ముమ్ముందుకు పోతున్నదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయాధికారి నామవరపు రాజేశ్వరరావు మాట్లాడుతూ భద్రాద్రి బ్యాంక్ క్రమశిక్షణతో అంచలంచలుగా ఎదుగుతూ రాష్ట్రంలోని అర్బన్‌బ్యాంక్‌లలో ఒక అగ్రగామిగా ఎదిగిందని అన్నారు.

జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకారశాఖ అధికారి గట్టు గంగాధర్ మాట్లాడుతూ భద్రాద్రి బ్యాంకు ఖమ్మం జిల్లాకే తలమాణికంగా నిలిచిందన్నారు. బ్యాంక్ వైస్ చైర్మన్, ఆహ్వానసంఘం సభ్యుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ మాట్లాడుతూ భద్రాద్రి బ్యాంక్ మనందరి బ్యాంక్‌గా జనం భావించుకుంటున్నారని అన్నారు. వైస్‌చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంక్ ప్రజల ఆర్థిక అవసరాలకే కాకుండా సామాజిక బాధ్యతగా సమాజంలోని అనేకమంది పీడితులకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. బ్యాంక్ ముఖ్య కార్య నిర్వాహాధికారి దాసరి వేణుగోపాల్ మాట్లాడుతూ బ్యాంక్ యొక్క అభివృద్ధిని, రాబోయే కాలంలో తీసుకొనబోయే చర్యలనూ సభ్యలకు సవివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు దేవత రాజారావు, బులుసు సాంబమూర్తి, మద్ది పిచ్చయ్య, రాజ్ పురోహిత్ చెన్‌సింగ్, వై.వి.ఎస్.రావు, రంగా నాగ శ్రీనివాసరావు, దారా జీవన్ రాం, కర్లపూడి నర్మద, కపిలవాయి జయప్రద, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు సీ.జీ.శాస్త్రి, పైడిమర్రి సత్యనారాయణ, ప్రొఫెసర్ పసుమర్తి మధుసూధనరావు, బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్.వీ.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

సంతాన సాఫల్య కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి


▸▸ పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 27(ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతుల బలహీనతలను క్యాష్ చేసుకుంటున్న కొన్ని ప్రైవేట్ సంతాన సాఫల్య కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమే మాట్లాడారు. ఒక్కో కాన్పుకు రూ. 5లక్షలకు పైగా రేటును నిర్ణయించి అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సంతాన సాఫల్య మాటున గలీజ్ దందా ఆధారంగా న్యాయ విచారణ చేపట్టాలని అన్నారు. మాతృత్వాన్ని కార్పొరేట్ శక్తులు వ్యాపారంగా మార్చుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంతాన సాఫల్య కేంద్రాలకు ఖచ్చితమైన మార్గదర్శకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆవుల మంగతాయి, బండెల లలిత, గోకినేపల్లి సరోజని, టీ ఝాన్సీ, ప్రతాపనేని శోభ, ఇమ్మిడి చైతన్య పాల్గొన్నారు.

నిండుకున్న చెరువులు..
పొంగుతున్న వాగులు



తిప్పారెడ్డిగూడెం వద్ద చెక్‌డ్యాం

ఖమ్మం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు నిండుకున్నాయి. వరదలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు దుక్కులు దున్ని నార్లు పోసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రధానంగా మండలంలోని తల్లంపాడు, పొన్నేకల్లు, కొండాపురం, ఎంవీపాలెం, ఆరెకోడు, ఆరెంపుల, పల్లెగూడెం తదితర గ్రామాల్లోని చెరువులు నిండుకున్నాయి. వక్క వర్షం కురిస్తే అలుగులు పోయనున్నాయి.

వర్షాలకు చెరువులు, వాగులు, కుంటలు నిండుకోవడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు నిండుకోవడంతో రైతులు దుక్కులు దున్ని నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. అదేవిధంగా చెరువులు నిండుగా నిండటంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిండిన చెరువుల్లో చేపపిల్లలు పోసేందుకు మత్స్య కారులు సిద్ధయ్యారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పత్తి తదితర పంటలకు ఊపిరి పోసినట్టు అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే నిండుకున్న చెరువుల నుంచి తూముల ద్వారా నీరు వృథాగా పోతున్నాయని ఐబీ అధికారులు స్పందించి వెంటనే తూములవద్ద మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ఆకేరుకు వరద ప్రవాహం

తిరుమలాయపాలెం, జూలై27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకేరు నదిలోకి భారీగా వరద నీరు చేరింది. ఇటీవల కురిసన భారీవర్షం మూలంగా మండలంలోని ఆకేరు నదిలోకి వరదపోటెత్తింది. వరంగల్ జిల్లాలో కురిసిన భారీవర్షాలతో ఆకేరు నదిలోని చెక్‌డ్యాంలన్నీనిండి పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని హైదరసాయిపేట, తిప్పారెడ్డిగూడెం, పడమటితండా, రమణతండా వద్ద ఆకేరు నదిపై నిర్మించిన చెక్‌డ్యాంలు నిండిపోయాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నిండుకుండను తలపిస్తున్న తల్లంపాడు చెరువు



జిల్లాకు చేరిన యూరియా


పరిశీలిస్తున్న అధికారులు

చింతకాని, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు కేటాయించిన యూరియా నిల్వలు ఆదివారం జిల్లా రాక్ పాయింట్ పందిళ్లపల్లికు చేరాయి. ఎన్ఎఫ్ఎల్ కంపెనీకు ద్వారా 2646 టన్నుల యూరియా చేరగా ఖమ్మం జిల్లాకు 1346 టన్నులు, కొత్తగూడెం జిల్లాకు 1300 టన్నులను కేటాయించారు. జిల్లాకు కేటాయించిన యూరియాలో 867.6 టన్నులు మార్క్‌ఫెడ్‌కు 578.4 టన్నులు ప్రైవేటు డీలర్లుకు పంపిణీ చేసినట్లు టెక్నికల్ ఏవో పవన్ కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న రాగమయి

తల్లాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లుపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 2 భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.12 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా అక్కడి పరిసర ప్రాంతంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజ, తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ, పీఆర్ ఏఈ కార్తీక్, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, మండలనాయకులు జక్కంపుడి కిషోర్, సామినేని రామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బేతుపల్లి చెరువు కట్ట

- విపరీతంగా పెరిగిన తుమ్మచెట్లు.. పట్టించుకోని అధికారులు
- కట్ట ఆసాంతం గుంతలమయమే.. కొద్దిపాటి వర్షానికే బురదమయం

సత్తుపల్లిరూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి, వేంసూరు మండలాలకు సుమారు 4-5వేల ఎకరాల ఆయకట్టు నీరందించే చెరువు నిర్వహణ దారుణంగా ఉంది. కొద్దిపాటి వర్షానికే చెరువు కట్ట బురదమయంగా మారగా ఎక్కడ బడితే అక్కడ గుంతలు పడి పటిష్ఠతకు ప్రశ్నార్థకంగా మారింది. సత్తుపల్లి మండల సాగునీటికి ప్రధాన జలవనరు బేతుపల్లి పెద్ద చెరువు. దీని కుడి, ఎడమ కాలువల ద్వారా మండలంలోని పలు గ్రామాలలో పంటలు సాగవుతుండగా అలుగు పారితే తమ్మిలేరు వాగు ప్రవహించడంతో చెరువు జీరో పాయింట్ వద్ద వరదనీటి కాలువ ద్వారా సత్తుపల్లితో పాటు వేంసూరు మండలాల్లో సుమారు 55చెరువులు నిండి సాగునీటికి లోటు లేకుండా ఉంటుంది. ఇంత ప్రాధాన్యత ఉన్న చెరువు నేడు యంత్రాంగం పట్టించుకోకపోవడంతో ఆ చెరువు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. చెరువు పూర్తి నీటిసామర్థ్యం 16అడుగులు కాగా ప్రస్తుతం 14అడుగులకు చేరుకుంది. ఇదే వర్షాలకు ఎడతెరిపి లేకుండా కురిసినట్లయితే అలుగు పారడంతోపాటు వరదనీటి కాలువకు నీటిని వదలవచ్చు. కుడి, ఎడమ కాలువలు సైతం మట్టి, ఇసుకతో పూడిపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి నీటిప్రవాహానికి ఆటంకంగా మారగా సాగునీరు పంటలకు సమృద్ధిగా అందే పరిస్థితి కనిపించడం లేదు. స్థానికులు, చుట్టుపక్కల వారు చెత్తాచెదారం, మెడికల్ ఈ-వేస్‌ను చెరువులోనే వేస్తుండగా ఇదే చెరువు నుంచి పలు గ్రామాలకు తాగునీటిని సైతం అధికారులు అందిస్తున్నారు. అయితే చెరువు కట్టపై ఎక్కడ బడితే అక్కడ గుంతల మయంగా మారడం, తుమ్మచెట్లు ఇరువైపులా పెరిగి అడవిని తలపించడంతో కనీసం కట్టపై నడిచే పరిస్థితి కూడా లేదని రైతులు వాపోతున్నారు. అదే విధంగా హరితహారం, వనమహోత్సవాల పేరుతో ఈ కట్టపై వేసిన మొక్కల ఆలనాపాలన లేకపోవడంతోపాటు చెరువు పటిష్ఠతకు ఏమాత్రం ఉపయోగపడలేదని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా ఆర్థికంగా లాభాలు గడిస్తున్న మత్స్యశాఖ, సహకార సంఘానికి చెరువులో చేపల పెంపకంపై ఉన్న శ్రద్ధ చెరువు అభివృద్ధిలో లేదని, రైతులు సైతం నీటిని వాడుకోవడమేగానీ అధికారులపై ఒత్తిడి తేవకపోవడంతో ఆ చెరువు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై నీటి పారుదల శాఖ డీఈఈ మరియన్నను వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిందని, పరిశీలించి డోజర్ సహాయంతో తుమ్మచెట్లు తీయించి గ్రావెల్ పోయిస్తామని తెలిపారు.


జలకళను సంతరించుకున్న బేతుపల్లి పెద్ద చెరువు


చెరువులో వేస్తున్న చెత్తాచెదారం, వ్యర్థాలు


చెరువు కట్టపై గుంతలలో నిలిచిన వర్షపు నీరు



పంట పొలాల సందర్శనలో పొంగులేటి

కల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన కల్లూరు మండలంలోని నారాయణపురంలో ఆదివారం క్షేత్ర స్థాయిలో పంట పొలాలను సందర్శించి పరిశీలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని బిజీబిజీగా గడిపిన మంత్రి పొంగులేటి తన స్వగ్రామానికి సాయింత్రం 4 గంటల సమయంలో చేరుకుని ఇంటి నుంచి నేరుగా పంట పొలాల్లో వరి పైరు సాగు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. విషయం తెలుకున్న స్థానిక ప్రజలు మంత్రిని కలిసి మాటా మంతి మాట్లాడుకున్నారు. సుమారు ఒక గంట పాటుగా ఆ గ్రామంలో పంట పొలాల్లో కలియ తిరిగారు. అనంతరం మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో అనారోగ్యంతో ఉన్న మాజీ ఎంపీటీసీ కుక్క నాగమ్మ వేల్పాద్రి కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి పొంగులేటితోపాటుగా మండల కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, బాగం ప్రభాకరచౌదరి, ముకర విజయరావు, యాసా శ్రీకాంత్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు ప్రత్యేక కౌన్సిలింగ్

మధిర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి నిర్వహించే ప్రత్యేక కౌన్సిలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. 2025-26 సంవత్సరానికి గాను డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ, బీఎస్సీ బీకాం లో ప్రవేశానికి ఈనెల 31 వరకు దోస్త్ ద్వారా అడ్మిషన్ పొందేందుకు ఇదే చివరి అవకాశం అని తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు పొదుపు సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణం

ముదిగొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం మేడేపల్లి రైతు పొదుపు సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టే 17మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి వడ్డీ లేకుండా రుణం రూ.రెండులక్షల వరకు అందిస్తున్నట్లు మాజీ సర్పంచ్, మేడేపల్లి రైతు పొదుపు సహకార సంఘం అధ్యక్షుడు సామినేని రమేష్ తెలిపారు. ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు అందించే రూ.రెండులక్షలకు తానే రైతు పొదుపు సహకార సంఘానికి వడ్డీ చెల్లించనున్నట్లు సామినేని రమేష్ తెలిపారు. వడ్డీ లేని రుణం మంజూరు చేయటం పట్ల సామినేని రమేష్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ కొత్తపల్లి నాగలక్ష్మీ, నాయకులు బయ్యాని రమేష్, సంజీవరెడ్డి, నర్సింహారావు, మాధవరావు పాల్గొన్నారు.

తండాలను రెవెన్యూ గ్రామాలుగా చేయాలి

తల్లాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలైన తండాలను రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటుచేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరధ్‌నాయక్ డిమాండ్ చశారు. ఆదివారం మండలంలోని రంగంబంజరలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటుచేయాలని కోరారు. గిరిజన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న జరిగే చలో హైదరాబాదు కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. సంగం నాయకులు భూక్యా రవి, బానోతు నందు, కృష్ణ, సైదా, లింగ, నాగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను నిర్వహించాలి

- జిల్లా ప్రోగ్రాం అధికారి, డీఎల్‌పీవోలు

బోనకల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులను సమర్థవంతంగా నిర్వహించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి రామారావు, డీఎల్‌పీవో రాంబాబు సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశానుసారం మండలంలోని ముష్టికుంట్ల, తూటికుంట్ల, బోనకల్ గ్రామాల్లో ఆదివారం పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానిక పీహెచ్‌సీలో ఓపి, ఫార్మసీ స్టాక్ రికార్డులు, ఫీవర్ సర్వేను పర్యవేక్షించారు. జ్వరాల కేసులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఇళ్ల పరిసరాలను చూసి పాత టైర్లు, గాబుల్లో నీళ్ల నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఎంపీడీవో ఆర్. రమాదేవి, వైద్యాధికారి స్రవంతి, ఎంపీవో శాస్త్రీ, సూపర్‌వైజర్ దానయ్య పాల్గొన్నారు.

పలు వార్డుల్లో రేషన్ కార్డుల పంపిణీ

మధిర,జూలై27(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గత పదేళ్లుగా రేషన్ కార్డులు లేక మధిర పట్టణంలో అనేక మంది నిరుపేదలు ఇబ్బందులకు గురయ్యారని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించి అర్హులందరికీ కార్డులు ఇస్తోందని వారు అన్నారు. మాజీ కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముదిగొండ భూ పోరాటానికి 18ఏళ్లు

ముదిగొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ముదిగొండ కాల్పుల సంఘటన జరిగి నేటికి 18ఏళ్లు పూర్తయింది. జానెడు జాగ కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఏడుగురు మృతిచెందగా 23మందికి బుల్లెట్ గాయాలయ్యాయి. భూ పోరాట అమరవీరుల స్థూపం వద్ద సోమవారం 18వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం తెలిపారు. ఈ వర్ధంతి సభకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొంటారని సీపీఎం నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

డివైడర్లలో పిచ్చిచెట్ల తొలగింపు

వైరా, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న డివైడర్లలోని పిచ్చిచెట్లను తొలగించారు. ఆదివారం ప్రత్యేకంగా డివైడర్లలో డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివైడర్లపైన అడ్డదిడ్డంగా ఉన్న మొక్కల కొమ్మలను అలాగే ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లు, చెత్తాచెదారాన్ని తొలగించారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు ఈ పనులను పరిశీలించారు.

నేడు కోటమైసమ్మ ఆలయంలో వేలంపాట

కారేపల్లి జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో గల శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయంలో సోమవారం వేలంపాటలు ఉన్నాయని ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ పర్సాపట్టాభి రామారావు, ఈవో వెణుగోలచార్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దసర పండగ సందర్భంగా నిర్వహించే కొబ్బరి కాయల విక్రయాలకు సంబంధించి వేలం పాటలు నిర్వహిస్తారు. వేలం పాటలు ఉదయం 11గంటలకు ఆలయం ప్రాంగణంలోనే జరుగుతాయని, పాటదారులు పాల్గొన్నాలన్నారు.

పేదలకు పథకాల పంపిణే ప్రభుత్వ ధ్యేయం


కార్డులు అందిస్తున్న మల్లు నందిని, రాయల

ముదిగొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముదిగొండ మండలం వెంకటాపురం, ముదిగొండ గ్రామాల్లో ఆదివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, నాగేశ్వరరావు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం వెంకటాపురంలో జరిగిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గ అభివృద్ధికి వేలకోట్లరూపాయలు మంజూరు చేయించారని వారు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి, మాజీ జడ్పీటీసీలు బులెట్ బాబు, పసుపులేటి దేవేంద్రం, నాయకులు సామినేని వెంకటేశ్వరరావు, గుడిపూడి ఝాన్సీరాణి, కందిమళ్ల వీరబాబు, మల్లెల అజయ్, ఉసికల రమేష్, పాల్గొన్నారు.

జక్కంపుడి సహకారం మరువలేనిది: తుమ్మల


వర్ధంతి సభలో మాట్లాడుతున్న తుమ్మల

తల్లాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): 'నా రాజకీయ జీవితంలో చేదోడువాదోడుగా ఉన్న సీనియర్ రాజకీయ వేత్త జక్కంపుడి కృష్ణమూర్తి అందించిన సహకారం మరువలేనిదని' రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రజా గౌరవంతో పోలిస్తే మంత్రి పదవి ఎక్కువకాదని పేర్కొన్నారు. ఆదివారం తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో మాజీ సర్పంచ్‌లు జక్కంపుడి కృష్ణమూర్తి -ప్రేమలత దంపతుల ప్రథమ వర్ధంతి సభ జక్కంపుడి కిషోర్ అధ్యక్షతన జరిగింది. సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తన 43 ఏళ్ల రాజకీయప్రస్థానంలో గెలిచినా, ఓడినా ఇబ్బందుల్లో ఉన్నా కష్టాలు ఎదురైనా ఎంతో మంది అవమానపరిచినా, అవహేళన చేసినా జక్కంపుడి కృష్ణమూర్తి జీవితాంతం తనకు తోడుగా నిలిచారని, ఆయన సహకారాన్ని జన్మజన్మలకు మరిచిపోనని కొనియాడారు. భగవంతుడు ఎన్టీఆర్ ఇచ్చిన శక్తిమేరకు తాను ఎంతోమందిని అందలం ఎక్కించినా ఎవరు స్థిరంగా ఉండలేదన్నారు. శ్రీరామచంద్రుడు, ఎన్టీఆర్ దయవల్ల నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో నిలబడేందుకు శక్తినిచ్చిన ప్రజలందరికి కృతజ్ఞతలు చెప్పారు. రాజకీయాల్లో తనకు అండగా నిలిచినవారిలో జక్కంపుడి కృష్ణమూర్తి అగ్రగణ్యుడని తెలిపారు. ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, కేసీఆర్, రేవంత్‌రెడ్డిల ద్వారా రాష్ట్రానికి, జిల్లాకు రైతాంగానికి మేలు చేయాలనే తపనతోనే మంత్రి పదవిలో ఉన్నాన్నారు. జక్కంపుడి కృష్ణమూర్తి బిల్లుపాడు గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆయన ఆశయసాధనకోసం భవిష్యత్తులో కూడా తల్లాడ మండలం అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. సభలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలలో తన విజయానికి జక్కంపుడి కృష్ణమూర్తి ప్రధానపాత్రం పోషించారన్నారు. సభలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజ, మాజీచైర్మన్ దిర్సాల కృష్ణయ్య, సొసైటీ ఛైర్మన్లు దిరిశాల నరసింహారావు, తూము వీరభద్రరావు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగుగల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, మాజీ ఎంపీటీసీ సరికొండ రమణమ్మ, నాయకుఉల సామినేని రామాఅప్పారావు, దిరిశాల సత్యనారాయణ, అడపా అనిల్, తుమ్మలపల్లి రమేష్, జక్కంపుడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ వడ్డీ వ్యాపారం

కల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పట్టణంలో కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్డీ వ్యాపారం సాగించాలంటే లైసెన్స్ పొంది ఉండాలి. దీనికి తోడు ప్రతి ఏడాది వారు సాగిస్తున్న ఆర్థిక లావాదేవిలపై ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా కల్లూరు పట్టణంలో వ్యాపారులు ఆర్థిక అవసరం ఉన్న వారి ఆస్తులను తమపేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని వాటి విలువను బట్టి అవసరం మేరకు నగదును వడ్డీకి ఇస్తున్నారు. ఇలా నూటికి(రూ.100) కు గాను సగటున నెలకు రూ. 3, 5, 10 వరకు వడ్డీకి అప్పుగా బాధితులు తీసుకుంటున్నారు. వడ్డీ వ్యాపారుల నిర్ణయించన గడువులోగా బాధితులు తీసుకున్న నగదును వడ్డీతో సహా చెల్లించనిచో తనఖ పెట్టిన భూములు, స్థలాలను, విలువైన మోటారు వాహనాలను వ్యాపారులు స్వాధిన పరుచుకుంటున్నారు. తమ ఆర్థిక పరిస్థితులు దెబ్బతినడంతో పలువురు అప్పులు సకాలంలో చెల్లించకపోవడంతో కొంతమంది వడ్డీ వ్యాపారులు తీవ్రమైన వేధింపులకు పాల్పడుతన్నట్లు బాధితులు చెప్తున్నారు. అందుకు నిదర్శనంగా కల్లూరు పట్టణంలో ఓ వడ్డీ వ్యాపారి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారంను లక్షల్లో సాగిస్తూ పలువురు అప్పులు సకాలంలో చెల్లించక పోవటంతో అసలు నగదు, వడ్డీ కింద కలిపి పలువురు బాధితలు నుంచి రూ. 90 లక్షల విలువైన మోటారు వాహనాలను తన స్వాధినలో ఉంచుకోగా, బాధితలు తగిన న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించయచగా కల్లూరు ఏసిపి రఘు ఆధ్వర్యంలో పోలీసులు సదరు వడ్డీ వాపారి అధినంలో ఉన్న మోటారు వాహనాలను స్వాధిన పరుచుకోని కేసు నమోదు చేశారు. ఇలా అక్రమ వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారాన్ని గుట్టుగా సాగిస్తున్న వ్యక్తులపై నిఘా పెట్టి చట్ట పరంగా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు.. కాంగ్రెస్ ఘనతే


ప్రసంగిస్తున్న కాల్వ సుజాత

వైరా, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత పేర్కొన్నారు. వైరాలోని హరిహరసుత అయ్యప్పస్వామి మండపంలో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్యుల రాజకీయ చైతన్య, ఆత్మీయ సమ్మేళనంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాకేష్, పలువురు నాయకులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఆర్యవైశ్యులకు అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తానని, నిరుపేద ఆర్యవైశ్యులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని, రాజీవ్ యువవికాసం కింద రుణాలు అందేలా చూస్తానని తెలిపారు. జనాభా ధామాషా పద్ధతిలో రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు అత్యధిక సీట్లు ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. ఆర్యవైశ్య యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. తాను నేడు ఈ స్థాయిలోకి ఉండటానికి ఆర్యవైశ్యులు ఒక కారణమని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కొణిజేటి రోశయ్యకు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఎన్నో అవకాశాలు కల్పించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కొదుమూరి దయాకర్, వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ కొత్తా వెంకటేశ్వరరావు, రంగా జనార్ధన్, వెంకటేశ్వరరావు, వెంకటనర్సిరెడ్డి, మిట్టపల్లి నాగి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'స్థానికం' కోసం చింతకానిలో మొదలైన వర్గపోరు

- పార్టీ మార్పులతో అయోమయంలో బీఆర్ఎస్ శ్రేణులు
- మరింత బలోపేతం దిశగా కాంగ్రెస్ అడుగులు

చింతకాని, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చింతకాని మండల రాజకీయాలు రసవత్తరంగా మారాయి. మండల వ్యాప్తంగా స్థానికంలో ఎలాగైనా పై చేయి సాధించాలని కాంగ్రెస్ నాయకత్వం ఉవ్విళ్లూరుతుండగా అటు బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు పార్టీ మారుతారంటూ ఊహగానాలు ఆ పార్టీ శ్రేణులను అయోమయం చేస్తున్నాయి. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అండతో కాంగ్రెస్ 14 ఎంపీటీసీ స్థానాలతోపాటు జడ్పీటీసీ, 26 గ్రామ పంచాయతీలలో గెలుపొందేందకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

కాంగ్రెస్‌తో టచ్‌లోకి కొందరు నాయకులు..

ఇటీవల బీఆర్ఎస్ మండల పార్టీ చెందిన కొందరు ముఖ్య నేతలు భట్టిని కలవడంతో రాజకీయంగా మండలమంతా తీవ్ర చర్చాంశనీయమైంది. 9 సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సానికంగా ఎమ్మెల్యే లేకపోవడంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ నియోజకవర్గంలో భట్టి మాటే చెల్లుబాటు కావడంతో అప్పట్లో ఈ విషయం బీఆర్ఎస్ శ్రేణులకు మింగుడు పడలేదు. భట్టితో ఉంటే సొంత పనులతోపాటు రాజకీయ పనులు చక్కదిద్దుకోవచ్చని కుటుంబ సభ్యులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులపై ఒత్తిడి తెస్తుండటంతో కొందరు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే తీవ్ర పోటీ ఉన్న కాంగ్రెస్ పార్టీలో తాము చేరితే గౌరవ ప్రదమైన స్థానం దక్కుతుందో లేదో అని చేరికపై కొందరు నాయకులు ఊగిసలాడుతున్నట్లు సమాచారం.

మరింత బలోపేతం దిశగా కాంగ్రెస్...

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎమ్మెల్యేగా గెలుపొందిన 4 సార్లలో అత్యధిక మెజారిటీ ఇచ్చిన చింతకాని మండలంపై ఎక్కువ దృష్టి సారించారు. వచ్చే స్థానిక ఎన్నికలలో మెజార్టీ స్థానాలు గెలుపొందాలంటే చేరికలు అవసరమని ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి అడ్డుపడకూడదని నేతలకు సంకేతాలు ఇచ్చారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండి మండలంపై మంచి పట్టు ఉన్న ముఖ్య నేతలను పార్టీలో చేర్చుకునేందుకు కార్యచరణ రూపొందించనట్లు ఆ మేరకు రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు ఉండబోతున్నాయని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

ఆసుపత్రి కార్మికుల వేతనాల విడుదల

కల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) ఆసుపత్రి కార్మికుల పెండింగ్ వేతనాల విడుదల ఏఐటీయూసీ పోరాట ఫలితమమేనని జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు అన్నారు. కల్లూరులో ఆదివారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల క్రితం రోజు వారి విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేయడం, ప్రభుత్వం దృష్టికి తెచ్చిన ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే వేతనాలు విడుదలయ్యాయని అన్నారు. రానున్న రోజుల్లో కనీస వేతనం అమలుకు ఉద్యమిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచుకుంటూ ఏఐటీయూసీ నాయకులకు ధన్యావాదములు తెలిపారు. కార్మిక నాయకులు తడికమళ్ల యోబు, దామాల దయాకర్, ప్రమోదు, వంశీ, లక్ష్మీ, రమాదేవి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఏన్కూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూతక్కలింగన్నపేట, ఏన్కూరులోని ఎరువలు, పురుగుమందుల దుకాణాలను ఆదివారం మండల వ్యవసాయశాఖ శాఖ అధికారి ఎ.నరసింహారావు ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా గోదాం స్టాక్, పీవోసీ మిషన్లను, స్టాక్‌బోర్డు, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆమోదించిన ఎరువులను, పురుగుమందులను మాత్రమే విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. లైసెన్స్‌లు కలిగిన డీలర్ల వద్దనే పురుగుమందులను కొనలన్నారు.

పినపాక-సిరిపురం మధ్య ధ్వంసమైన రోడ్డు


రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

వైరా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైరా-నెమలి రూట్లో పినపాక క్రాస్‌రోడ్డు నుంచి కనకగిరి సిరిపురం మధ్యలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్ పాస్ హైలెవల్ వంతెన వరకు రోడ్డు మొత్తం ధ్వంసమైంది. కిలోమీటర్ మేర రోడ్డు ఆనవాలు లేకుండా తయారైంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో ఉండే భారీ వాహనాల రాకపోకలతో ఆర్అండ్‌బీ రోడ్డు మొత్తం కుంగిపోయి ధ్వంసమైంది. గత మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఈ గుంతల్లో నీరు చేరింది. దీంతో వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భారీ వాహనాల్లో రోడ్డు సామర్థ్యానికి మించిన టన్నులకొద్దీ బరువుతో స్టోన్ డస్ట్, మట్టి ఇతర మెటీరియల్‌ను ఈ రోడ్డుపైనే తరలించారు. దాంతో రోడ్డు మధ్యభాగంలో రెండు, మూడుఅడుగుల లోతు కుంగిపోయింది. కొన్నిచోట్ల బీటీ, వెట్‌మిక్స్ కంకర పూర్తిగా పైకి తేలింది. కిలోమీటర్ దూరం రోడ్డు అడుగడుగునా భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై గుంతలను చూసిన వారెవరికైనా ఇది ఆర్అండ్‌బీ రోడ్డేనా అనే సందేహం కలగకమానదు. ఈ రోడ్డుపైన ప్రతిరోజూ వేలాది ద్విచక్రవాహన, త్రిచక్ర వాహనాలతోపాటు ట్రాక్టర్లు, ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు తెలంగాణ,- ఏపీ గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగించటం తీవ్ర అసౌకర్యంగా మారింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే వాహనాలతో రోడ్డు ధ్వంసమైనప్పటికీ కనీస మరమ్మతులు చేయించే విషయంలో హైవే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. స్థానిక ఆర్అండ్‌బీ అధికారులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారని ఈరూట్ ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ధ్వంసమైన ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని, కనీసం గుంతలను పూడ్చాలని ఈ రూట్ ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కొణిజర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో రాంబాబు కోరారు. ఆదివారం మండల కేంద్రమైన కొణిజర్ల ఎస్సీ కాలనీలో సీజనల్ వ్యాధులు రాకుండ తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లో నీటితొట్లలో నీళ్ల నిల్వ ఉండకుండ చనర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు కాచిచలార్చిన నీటిని తాగాలని తెలిపారు. గ్రామాలలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో ఉపేంద్రయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి సర్వే తప్పనిసరిగా చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.టీ.సీతారామ్ సూచించారు. మండలంలోని గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, మందులు స్టాక్, రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆశాలు, ఏఎన్ఎంలతో ఇంటింటా వివరాలు సేకరించి జ్వరపీడితులను గుర్తించాలని, నిర్ధారణ అయిన వారి చుట్టుపక్కల ప్రతిఒక్కరికీ పరీక్షలు చేసి మందులను అందజేయాలని ఆదేశించారు. వైద్యులు ఆర్.అవినాష్, స్పందన, సూపర్‌వైజర్ శారారాణి, ఫార్మాసిస్ట్ సత్యనారాయణతో పాటు సిబ్బంది ఉన్నారు.

ముదిగొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా వ్యాక్సిన్ పరిపాలన అధికారి చందునాయక్ సూచించారు. ఆదివారం ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ నందు జరుగుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. వ్యాక్సిన్, ల్యాబ్, ఫార్మసీ నందు రికార్డులను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. వైద్యాధికారిణి అరుణాదేవి, వైద్య సిబ్బంది మధుసూదన్‌రావు, రామారావు, లత, నాగరాజకుమారి పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా మారిన డెంగ్యూ కేసు నమోదు

బోనకల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్ వద్ద గల ఓ ఇంట్లో నివాసం ఉంటున్న యువకుడికి డెంగ్యూ పాజిటివ్ వచ్చి చికిత్స పొందుతున్న అంశం మండలంలో చర్చానీయంశంగా మారింది. హైదరబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువకుడికి జ్వరం రావడంతో వారం రోజుల క్రితం బోనకల్‌లో ఇంటికి వచ్చాడు. బోనకల్ పీహెచ్‌సీకి వెళ్లి బ్లడ్ శాంపుల్ ఇవ్వగా డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారించారు.